క్లుప్తంగా

ఓటర్ల జాబితా పరిశీలన



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ కేవీ శ్రీనివాస్

వైరారూరల్: మండలంలోని గొల్లెనపాడు గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 237, 238 పరిధిలోని ఓటర్ల జాబితాను ఆదివారం తహసీల్దార్ కేవీ శ్రీనివాస్ పరిశీలించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల మీద సిబ్బందికి పలు సూచనలు చేశారు. తప్పిదాలు లేకుండా ఓటర్ల జాబితాను ప్రదర్శించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ జ్యోత్సదేవి, రెవెన్యూశాఖ సిబ్బంది ఉన్నారు.

సీబీఐ విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న రామలింగేశ్వరరావు

సత్తుపల్లి: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదం విషయమై నెలకొన్న వివాదంపై సీబీఐ విచారణ జరిపించాలని బీజేపీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు కోరారు. సత్తుపల్లిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. శ్రీవారికి నిత్య కైంకర్యాలు సక్రమంగా సాగేలా టీటీడీకి స్వయం ప్రతిపత్తి కలిగించాలని, పాలకమండలి చైర్మన్ మొదలు సభ్యుల వరకు రాజకీయాలతో సంబంధం లేని వారిని నియమించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు వీరంరాజు, సుదర్శన్‌మిశ్రా, నాయుడు రాఘవరావు, ఆచంట నాగస్వామి, పాలకొల్లు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భావితరాలకు మార్గదర్శి 'ఏచూరి'



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

వైరా: భావితరాలకు మార్గదర్శి సీతారాం ఏచూరి అని వైరా స్టడీ సర్కిల్ వ్యవస్థాపక సభ్యుడు పారుపల్లి చంద్రశేఖర్ బాబు, కన్వీనర్ బొంతు సమత తెలిపారు. ఆదివారం వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో చంద్రశేఖర్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థిగా జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన ఏచూరి మరణం వరకు అధ్యయనంలో అగ్రశ్రేణి విద్యార్థిగా నిలిచిన యోధుడన్నారు. దశాబ్దాల పాటు ఆయన ప్రజల కోసమే పని చేశారని వివరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, నాయకులు సుధాకర్, నాగేశ్వరరావు, కృష్ణారావు, అమరేంద్ర, మధు తదితరులు పాల్గొన్నారు.

సహ నిర్మాతలుగా సత్తుపల్లి వాసులు



సినిమా సహ నిర్మాతలను ప్రకటిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: తెలంగాణ ప్రజల స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం పోరాడి అమరుడైన దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర ప్రపంచానికి తెలిసేలా సినిమా నిర్మిస్తున్నట్లు దర్శకుడు సేనాపతి తెలిపారు. సత్తుపల్లిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు కొమురయ్య చరిత్ర ఆధారంగా అన్ని కుల సంఘాల సహకారంతో సినిమా తీస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రతీ జిల్లా నుంచి రూ.10వేలు పెట్టుబడి పెట్టే 30 మంది సహ నిర్మాతలకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈమేరకు సత్తుపల్లి నుంచి అల్లాడి రాము, షేక్ అబ్బుల్ రెహమాన్, చలమాల హైమావతి, కె.వెంకటేశ్వర్లు, దేవరపల్లి శ్రీనివాస్, గంజి ఝాన్సీరాణి, భూక్యా మణి ముందుకొచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో పి.విజయ్‌కుమార్, ఎక్కిరాల శ్రీనివాస్, మామిడాల ఝాన్సీ, దామాల్ల జయ, భూక్యా కృష్ణ, దేవరపల్లి రాజ్‌కుమారి, చిట్టూరి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ గందరగోళం



ఎన్నెస్పీ వద్ద ఆగి ఉన్న వాహనాలు

- ఎన్నెస్పీలో తరచూ ప్రమాదాలు
- మృత్యువాత పడుతున్న వాహనదారులు
- స్టాపర్లను ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు

కల్లూరు: పట్టణంలోని ఎన్నెస్పీ క్రాస్‌రోడ్‌లో వాహనాలు ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతూ ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు మృత్యువాత పడుతున్నారు.

పలుచోట్ల నిలుపుతున్న వాహనాలు..

కల్లూరు పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరమున్న ఎన్నెస్పీ వద్ద హైదరాబాద్ నుంచి రాజమండ్రి, ఆంధ్రా నుంచి హైదరాబాద్‌కు నేషనల్ హైవేపై వెళ్లే వాహనాలు పలుచోట్ల ఆగుతుంటాయి. ఎన్నెస్పీలో భోజన హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, కిరాణా షాపులు, బెల్ట్ షాపులు, టైర్ అండ్ మెకానిక్ షాపులు ఉండడంతో వాహనదారులు తమ వాహనాలను రాత్రింభవళ్లు ఇక్కడే నిలిపి వేస్తుంటారు. వాహనాల పార్కింగ్ సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు ట్రాఫిక్ బాగా ఉంటుంది.

ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు..

ద్విచక్ర వాహనదారులు నిలిపి ఉన్న లారీలు కదులుతున్నాయనే భ్రమలో వెనుక నుంచి ఢీకొంటూ ప్రమాదాలకు గురవుతున్నారు. హోటళ్లు, కిరాణా షాపుల ముందు వాహనాలు ఆపితే గంట వరకు కదలడం లేవు. దీంతో రాత్రిళ్లు గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై రోజు వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. ప్రమాదాలు సంభవించకుండా పోలీసులు రద్దీ సమయంలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి..



ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ ఉండడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఆగి ఉన్న లారీలను ఢీకొని ప్రమాదాల భారిన పడిన సంఘటనలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ బాగా ఉన్న సమయంలో పోలీస్ అధికారులు ట్రాఫిక్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ప్రమాదాలు జరగకుండా కాపాడాలి.

– ధరావత్ రవికుమార్, ఖాన్‌ఖాన్‌పేట

ట్రాఫిక్‌పై దృష్టి సారిస్తాం..



ఎన్నెస్పీలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఇప్పటికే పలు హోటళ్లు, కిరాణా షాపులు, ఇతర షాపుల యజమానులకు ట్రాఫిక్‌పై కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ప్రమాదాలు జరిగితే ప్రమాదం చేసిన వారు ఏ1 కాగా, ఏ షాపు ముందు వాహనం ఆగినప్పుడు ప్రమాదం జరిగితే ఆ షాపు యజమాని ఏ 2గా కేసు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు.

– ఎస్‌కే.షాకీర్, ఎస్సై

రైతులకు నష్టపరిహారం అందించాలి



సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: ప్రభుత్వ నిర్లక్ష్యంతో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ గండ్లను ప్రణాళికాయుతంగా పూడ్చకపోవడంతో సాగునీరు ఉన్నా పొలాలకు అందక రైతులు తీవ్రంగా నష్టపోయారని సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. సీతారామ ప్రాజెక్టును సాగర్‌కు అనుసంధానం చేశామని ప్రభుత్వం పగల్బాలు పలుకుతుండగా, ఆ నీటి విడుదలకు కార్యాచరణ చేయకపోవడం గర్హనీయమని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో సాగర్‌లో తక్కువ నీరు ఉన్నా పంటలకు విడుదల చేశారని, అంతేకాక కాళేశ్వరం నుంచి ఎస్సారెస్పీ బయన్నగూడెం వాగు ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు తరలించి మూడు తడులకు అందించారని గుర్తు చేశారు. ప్రస్తుతం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా రైతులను ఆదుకోవడంలో విఫలం కావడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని సండ్ర తెలిపారు. ఇకనైనా పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20వేలు పరిహారం చెల్లించేలా సర్వే చేయించాలని కోరారు. అంతేకాక సాగర్ కాల్వ గండ్ల మరమ్మతు త్వరగా చేపట్టి నీటిని వదలాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇష్టారాజ్యంగా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వేంసూరు: గ్రామాల్లో వార్డుల వారిగా ప్రకటించిన ఓటర్ల జాబితా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో పాటు ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తే పట్టించుకోని విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని మర్లపాడులో బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధికారులు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో పని చేస్తున్నారని, 1వ వార్డులో ఉన్న వ్యక్తిని 10 వార్డులో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులను వివిధ వార్డుల్లో బాదాలయింపు చేస్తున్నారని వాపోయారు. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన ప్రతిపక్ష నాయకులపై మండలస్థాయి అధికారులు వ్యటకారంగా సమాదానం ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలా వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, యర్ర రమేష్, దొడ్డ వెంకటకృష్ణరెడ్డి, గండ్ర సోమిరెడ్డి, దూబా శ్రీనివాసరెడ్డి, గొర్ల ప్రభాకర్‌రెడ్డి, కుక్కపల్లి సుధాకర్, పుచ్చాకాయల శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సరికాదు



విశ్వనాథ్

పెనుబల్లి: తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం సమంజసం కాదని పెనుబల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి విశ్వనాథ్ అన్నారు. సురవరం ప్రతాప్ రెడ్డిని గౌరవించేందుకు తెలుగు రాష్ట్రం సాధనకు ప్రాణత్యాగానికైన వెనుకాడని మహాయుడు, గిరిజనోద్ధరణకు పాటుపడిన మహానాయకుడు పొట్టి శ్రీరాములు అన్నారు. అలాంటి ఆ మహాత్ముడి పేరు మార్చడం సరికాదని, వేరే కొత్త పథకానికి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును పెట్టి ఆయనను గౌరవించాలని కోరారు.

అనాథ మృతదేహానికి అంత్య క్రియలు

పెనుబల్లి: మండల పరిధిలోని ఉప్పలచెలక గ్రామంలో ఆదివారం గ్రామస్తులు అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి మరణించడంతో అంత్యక్రియలు నిర్వహించి, ఖననం చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



రత్నమాలకు నగదు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నిరుపేద విద్యార్థినికి రూ.10 వేలు..

వైరా: వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైరాకు చెందిన నిరుపేద విద్యార్థి గద్వాల రత్నమాలకు ఉన్నత చదువు నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఫాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళికృష్ణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు చింతలపూడి వెంకటేశ్వరరావు, మరికంటి రాంగోపాల్ దాస్, ఉంద్రూ శ్యాంబాబు, పెనుగుండ ఉపేందర్, లగడపాటి ప్రభాకర్‌రావు, డాక్టర్ పెరుమాళ్ల కృష్ణామూర్తి, చింతోజు నాగేశ్వరరావు, గజ్జల కృష్ణమూర్తి, చెరుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్నేరు వరద బాధితులకు రూ.80 వేలు..



ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కల్లూరు: మున్నేరు వరద బాధితులకు కల్లూరు నుంచి ఉపాధ్యాయులు సేకరించిన విరాళం రూ.80 వేలు ఆదివారం ఖమ్మంలో బాధిత కుటుంబాలకు అందించారు. ఎన్ఆర్ఐలు చేబ్రోలు నాగార్జున, చేబ్రోలు శ్రీదేవి, చేబ్రోలు సుభాష్‌లు అందజేసిన రూ.60 వేలు, కొడిశాన శ్రీకాంత్, కొడిశాన చిన్న కృష్ణయ్యలు అందజేసిన రూ.20 వేలను అందించారు. ఆరు బాధిత కుటుంబాలకు రూ.10 వేలు చొప్పున రూ.60 వేలు, మరో 20 మందికి రూ.1,000 చొప్పున రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొడిశాన విజయ్‌కుమార్, దంతాల సుధాకర్, రాయల నాగేశ్వరరావు, అమర్లపూడి చక్రవర్తిలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.10వేలు..



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన తాళ్ల భూషణం భార్య తాళ్ల తిరుపతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబం కావటంతో దశ దిశ కర్మల కోసం అదే గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త బీరవెల్లి శ్రీనివాసరావు, కల్లూరు మాజీ ఎంపీపీ వీరవెల్లి రఘు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీరవెల్లి నర్సింహారావు, తాళ్ల నారాయణ, రామకోటి, మోహన్‌రావు పాల్గొన్నారు.

అక్టోబర్ 3నుంచి అమ్మవారి శరన్నవరాత్రోత్సవాలు



ఉత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

మధిర: మధిరలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించటం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు కపిలవాయి జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఆదివారం ఆలయంలో ఉత్సవాలకు సంబందించి ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీమాన్ శ్రీనివాసుల శేషాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో జూనియర్ అసిస్టెంట్ మృతి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని తహసీల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మీనవోలు గ్రామానికి చెందిన నండ్రు వెంకటరత్నం (43) ఆదివారం మృతి చెందాడు. గత కొద్ది రోజులకు ఆరోగ్యం బాగలేకపోవడంతో కుటుంబ సభ్యులో ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స చేస్తుండగానే మరణించాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. వెంకటరత్నం మృతదేహాన్ని తహసీల్దార్ ఉషాశారద, ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ అభిరామ్ సందర్శించి నివాళి అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం తరపున రూ.20వేలు కుటుంబసభ్యులకు అందజేశారు.

కొనసాగుతున్న ఖో-ఖో శిక్షణా శిబిరం




శిక్షణా శిబిరంలో క్రీడాకారులు

కల్లూరు: పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.. జిల్లా ఖో–ఖో అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న 34వ సబ్ జూనియర్ జాతీయ ఖో–ఖో శిక్షణా శిబిరం ఈ నెల 18 నుంచి 26 వరకు కల్లూరులోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో జరుగుతుంది. ఈ శిబిరం పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పొంగులేటి మాధురి, పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, పొంగులేటి శ్రీలక్ష్మిల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. 40 మంది క్రీడాకారులు, ఆరుగురు కోచ్‌లు మొత్తం 46 మందికి ప్లేయింగ్ కిట్, ట్రాక్ షూట్, షూస్, భోజన వసతి కల్పించారు. ఇక్కడ ప్రతిభ కనబరచిన వారు జార్ఖాండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారు.

అటెన్షన్ ప్లీజ్

గేదెలకు ఆవాసాలుగా.. డబుల్ బెడ్రూం ఇళ్లు



గత ప్రభుత్వం హయాంలో అర్హులైన నిరుపేదల కోసం గరికపాడు గ్రామం మధ్యలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఈ ఇళ్లు.. స్లాబ్‌లెవల్ వరకు పనులు చేపట్టిన తరువాత ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే నిలిపివేశారు. దీంతో అవి నిరుపయోగంగా మారడంతో.. స్థానికులు తమ గేదెలను అక్కడే కట్టేస్తున్నారు. ఈ తతంగం చూసిన వారంతా ఈ ఇళ్లను గేదెలకోసమే కట్టారనుకుంటా అంటూ గుసగుసలాడుతున్నారు. ఇప్పటి వరకు కూడా సంబంధిత అధికారులు కానీ, పాలకులు కానీ ఏ మాత్రం స్పందించకపోవడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– వైరారూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి, గరికపాడు
సెల్ నంబర్ : 8688014226

'జమిలి ఎన్నికలతో దేశంపై ఆధిపత్యం'



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

చింతకాని: జమిలి ఎన్నికల ద్వారా ఎన్డీఏ ప్రభుత్వం ఆధిపత్యం చలాయించాలనే దిశగా ముందుకు సాగుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం మండలంలోని పందిళ్లపల్లిలో నిర్వహించిన ఆ పార్టీ గ్రామశాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమైన జమిలి ఎన్నికల విధానాన్ని దేశ ప్రజలందరూ తిప్పికొట్టాలన్నారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం గ్రామశాఖను ఎన్నుకోగా పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా కోటేశ్వరరావును ఎన్నుకున్నారు. ఈ సభలో సీపీఎం మండల కార్యదర్శి గోపాలరావు, నాయకులు జానికిరాములు, ప్రసాద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నున్నానాగేశ్వరరావు

మామునూరు గ్రామంలో..



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఎర్రుపాలెం: పంటలకు సాగర్ జలాలను విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మామునూరు గ్రామంలో నిర్వహించిన గ్రామశాఖ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక కార్యకర్తలు పలు అంశాలను చర్చించారు. అనంతరం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసినివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వీరయ్య, మోక్షానందం, కోటేశ్వరరావు, హనుమంతరావు, లాల, శ్రీను, కరీం, పిచ్చయ్య, కష్ణ, సుందరావు తదితరులున్నారు.

బోనకల్‌లో..



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

బోనకల్: బోనకల్‌లో నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ మహాసభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చింతలచెర్వు కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. ఏచూరి సేవలను కొనియాడారు. అనంతరం పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా ఉప్పర శ్రీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, శ్రీను, బాబు, విశ్వనాథం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో సీపీఎం మహాసభలు..

కొణిజర్ల: మండలంలో లక్ష్మీపురంలో ధరావత్ మంగ్యా అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ మహాసభలో.. ఆపార్టీ జిల్లా నాయకుడు భూక్యా వీరభద్రం, తాళ్లపల్లి కృష్ణ పాల్గొని మాట్లాడారు. అంతకుముందు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతికి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నూతన కమిటీశాఖ కార్యదర్శిగా సత్యనారాయణను ఎన్నుకున్నారు. నాయకులు ప్రసాద్, హరిచంద్, రవికుమార్, ఆనందరావు, కనకయ్య, స్వప్న, కుమారి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉసిరికాయలపల్లిలో..



ఉసిరికాయలపల్లిలో జెండా ఎగురవేస్తున్న నాగేశ్వరరావు

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి 1,2లో నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సభలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు పాల్గొని పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతున్నారు. అనంతరం ఉసిరికాయలపల్లి శాఖ–1 కార్యదర్శిగా తేజావత్ చందర్ ను ఎన్నుకోగా, శాఖ–2 కార్యదర్శిగా దాసరి సైదులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కె.నరేంద్రర్, మాజీ సర్పంచ్ బానోత్ బన్సీలాల్, నాయకులు దాసరి మల్లయ్య, పోతురాజు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకుడు రాయల రామారావు నివాసంలో నిర్వహించిన ఆ పార్టీ జనరల్ శాఖ మహాసభలో సీపీఎం జిల్లా నాయకుడు మోరంపూడి పాండురంగారావు, పట్టణ కార్యదర్శి రావుల రాజబాబు పాల్గొని మాట్లాడారు. ఈ సదర్భంగా రామారావు పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం నూతన కార్యదర్శిగా మోరంపూడి వెంకట్రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సర్వేశ్వరరావు, రామారావు, వెంకట్రావు, రవి, మల్లికార్జున్, రమేష్ పాల్గొన్నారు.